# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశాన్ని విశ్వ శిఖరాలకు తీసుకెళ్తామని ప్రజలంతా ప్రతిజ్ఞ చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు.
- ❖ పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఒమన్, మలేషియా, జోర్డాన్, ఫ్రాన్స్ దేశాధినేతలతో టెలీఫోన్‌లో చర్చలు జరిపారు.
- ❖ రక్షణ ఉత్పాదక రంగంలో ఎంఎస్ఎంఈలు కీలకంగా మారుతున్నాయని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.
- ❖ జీవ ఆర్థిక వ్యవస్థలో భారత్ గణనీయమైన పురోగతిని సాధించిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో దేశం పునరుజ్జీవనాన్ని పొందుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ఈ ఉదయం అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయాన్ని సందర్శించి.. శ్రీరామ యంత్రస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ.... అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయం దేశ పునరుజ్జీవనానికి ప్రతీక అని పేర్కొన్నారు. దేశం కోసం ప్రార్థించినా.. శ్రీరాముడి కోసం ప్రార్థించినా మన భావోద్వేగాలు, అనుభూతులు ఒకటేనని అన్నారు. మన దేశాన్ని ఈ విశ్వపు శిఖరాలకు తీసుకెళ్తామని శ్రీరాముడి నగరమైన అయోధ్యలో మనమందరం ప్రతిజ్ఞ చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు దేశాల అధినేతలతో ఈరోజు టెలీఫోన్‌లో సంభాషించారు. ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిక్‌తో జరిగిన చర్చల్లో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించడానికి, శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించేందుకు చర్చలు, దౌత్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని భారత్, ఒమన్‌లు అంగీకరించాయని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. మలేషియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో సంభాషించి.. పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఆందోళనకరమైన పరిస్థితిపై చర్చించారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి, త్వరగా శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు తమ ఉమ్మడి నిబద్ధతను పునరుద్ఘాటించారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-II తో చర్చల సందర్భంగా ఇరువురు నేతలు పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే.. ఆ ప్రాంతంలో శాంతి, భద్రతలను త్వరగా పునరుద్ధరించడానికి చర్చలు, దౌత్యం ఆవశ్యకమని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను తగ్గించి చర్చలు, దౌత్యానికి తిరిగి రావాల్సిన ఆవశ్యకతపై చర్చించడానికి ప్రధానమంత్రి.. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో సంభాషించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రక్షణ ఉత్పాదక రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) కీలకంగా మారుతున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన "జాతీయ రక్షణ పరిశ్రమల సదస్సు"లో ఈరోజు ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడంలో స్థానిక పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు కీలక పాత్ర పోషిస్తూ జాతీయ ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతున్నాయన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్, రోబోటిక్స్, ఇతర ఆధునిక సాంకేతికతల వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలలో అనేక ఎంఎస్ఎంఈలు చురుకుగా పని చేస్తున్నాయని చెప్పారు. అత్యాధునిక రక్షణ సాంకేతికతలను ప్రోత్సహించడానికి పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఏసింగ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇన్నోవేటివ్ టెక్నాలజీస్ పథకం పని చేస్తోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా సంఘర్షణ వల్ల ప్రభావితమైన భారతీయ ఎగుమతిదారులకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం రెసిలియెన్స్ అండ్ లాజిస్టిక్ ఇంటర్వెన్షన్ ఫర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ (RELIEF) పథకాన్ని ప్రారంభించింది. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక పత్రికా సమావేశంలోడైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్.. లవ్ అగర్వాల్ మాట్లాడుతూ... గత నెల 14 నుండి ఈనెల 15 వరకు జారీ చేయబడిన బిల్లులతో సముద్ర, వాయు మార్గాల ద్వారా కీలకమైన మధ్యప్రాచ్య ప్రాంతాలకు జరిగే రవాణాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఈ పథకం ఎంఎస్ఎంఈ లకు మద్దతుగా సప్లై చైన్ నిరంతరాయంగా కొనసాగేలా చూస్తుందని లవ్ అగర్వాల్ వివరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

నూతన సంవత్సరం, ఉగాది, గుడి పడ్వా, చేతి చంద్, నవ్రే, సజిబు చైరొబా, చైత్ర నవరాత్రుల ప్రారంభం సందర్భంగా ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ఈరోజు దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో జరుపుకునే ఈ పండుగలు సాంప్రదాయ నూతన సంవత్సరానికి నాంది పలుకుతాయని, వసంత ఋతువు రాకను సూచిస్తాయని సామాజిక మాధ్యమ్యం సందేశంలో ఉప రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా సందేశంలో ఈ పండుగలు అందరికీ ఆనందం, అదృష్టం, శ్రేయస్సులతో పాటు మంచి ఆరోగ్యాన్ని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇవి నూతన సంవత్సర ఆగమనాన్ని సూచిస్తాయని, కొత్త అవకాశాల భావనను తీసుకువస్తాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం జీవ ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన పురోగతిని సాధించి 195.3 బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకుందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. న్యూఢిల్లీలో బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (BIRAC) 14వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. 2014లో దేశ జీవ ఆర్థిక వ్యవస్థ 10 బిలియన్ డాలర్లుగా ఉండేదని, కేవలం దశాబ్ద కాలంలోనే ఇది దాదాపు 20 రెట్లు పెరిగిందని చెప్పారు. భవిష్యత్‌లో పారిశ్రామిక విప్లవం బయోటెక్నాలజీ ఆధారంగా ఉండబోతోందని, ఆర్థిక వృద్ధి స్వరూపం ఐటీ నుండి ప్రధానంగా బయోటెక్ వైపు మారబోతోందని చెప్పారు. శాస్త్రవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, అంకుర సంస్థల బలమైన మద్దతుతో భారత్.. 2030 నాటికి 300 బిలియన్ డాలర్ల జీవ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం దిశగా పయనిస్తోందన్నారు. పరిశోధనను పరిశ్రమతో అనుసంధానించడంలోనూ, ఆలోచనలను మార్కెట్‌కు సిద్ధంగా ఉన్న పరిష్కారాలుగా మార్చడంలోనూ BIRAC కీలక పాత్ర పోషించిందని జితేంద్ర సింగ్ పేర్కొంటూ…

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

గల్ఫ్ ప్రాంతంలోని ఇంధన స్థావరాలపై ఇటీవల జరిగిన దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఒక ప్రకటన చేస్తూ.. ఇప్పటికే అనిశ్చితంగా ఉన్న ప్రపంచ ఇంధన పరిస్థితిని ఇవి మరింత అస్థిరపరిచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇటువంటి దాడులు ఆమోదయోగ్యం కాదని, వాటిని వెంటనే నిలిపివేయాలని ఆ ప్రకటనలో కోరారు. న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులతో రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ... ఇంధన సరఫరా ఒక ప్రధాన ఆందోళనగా నిలుస్తోందని, దీనివల్ల నౌకా మార్గాలపై కూడా ప్రభావం పడుతోందన్నారు. ఎల్పీజీ లభ్యతను పర్యవేక్షిస్తున్నామని, ప్రభుత్వం దేశీయ వినియోగదారులకు ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా గృహ వినియోగానికి పీఎన్‌జీ, రవాణా ప్రయోజనాల కోసం సీఎన్‌జీ సరఫరా 100 శాతం ఉండేలా చర్యలు తీసుకున్నామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. పశ్చిమ ఆసియాలోని తాజా పరిణామాలపై న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖల సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ మాట్లాడుతూ... రెండు వారాల వ్యవధిలో సుమారు లక్షా 25 వేల గృహ, వాణిజ్య కనెక్షన్లు జారీ చేశామని తెలిపారు. గత మూడు రోజుల్లో 5 వేల 600 మందికి పైగా వినియోగదారులు పీఎన్‌జీకి మారారని చెప్పారు. పీఎన్‌జీ నెట్‌వర్క్‌ల విస్తరణకు సహకరించాలని కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కోరిందని, అదనంగా 10 శాతం వాణిజ్య ఎల్‌పిజిని అందించాలని ప్రతిపాదించిందని చెప్పారు. ఎల్పీజీ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ.. నిల్వలు పూర్తిగా అయిపోయే ప్రమాదం లేదని సుజాత శర్మ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = =